


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

9490056011, 9603969335



సంపుటి : 3 | సంచిక : 239 | ఏప్రిల్ 26 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-






**మన దునియా జగిత్యాల జిల్లా సారంగాపూర్,నగునూర్:ఏప్రిల్ 25**

ఒక పేద మహిళ చేతిలో డబ్బుల కట్ట. ఎదురుగా ప్రభుత్వ ఆఫీసు. ఆమె గొంతులో వణుకు. కళ్లలో నీళ్లు. ఆమె అంటోంది: "ఇదుగోండి సార్ౖ మీరు అడిగిన యాభై వేలుౖ ఒక్క రూపాయి తక్కువ కాదుౖ ఇప్పుడు మా పని చేస్తారా?" ఇది సినిమా సన్నివేశం కాదు. ఇది నిజ జీవితం. మన చుట్టూ జరుగుతున్న కఠిన సత్యం. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్ గ్రామంలో రేంగుంట గంగమ్మ (భర్త: రేంగుంట రాజు) అనే మహిళకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఇల్లు లేని పేదలకు ఆసరాగా ప్రభుత్వం ఇచ్చేదే ఈ ఇల్లు. కానీ ఈ ఇల్లు తనకు రావాలంటే గంగమ్మకు ఒక అడ్డంకి వచ్చింది. "ముగ్గు పోసిన ఫొటోలు అప్లోడ్ చేయాలి" అనే చిన్న పనికి గ్రామ కార్యదర్శి ఆరిఫోద్దీన్ అనే అధికారి యాభై వేలు లంచం అడిగారు. అవును. ఇల్లు లేని పేద మహిళ దగ్గర యాభై వేలు లంచం.గంగమ్మ బాధ అక్కడితో ఆగలేదు. ఆమె భర్త పేరు మీద ఉన్న కొంచెం స్థలాన్ని తన పేరు మీదకు మార్చుకోవడానికే ఇంతకుముందు ముప్పై వేలు లంచం ఇచ్చేసింది. ఇప్పుడు ఇల్లు కోసం మరో యాభై వేలు. మొత్తం ఎనభై వేలు. ఒక పేద కుటుంబానికి ఎనభై వేలు అంటే అది డబ్బు కాదు అది చెమట, అప్పు, బాధ, అవమానం. గంగమ్మ ఒకటే ప్రశ్న అడిగింది. ఆ ప్రశ్న ఒక్కటే చాలు మన వ్యవస్థను కుదిపేయడానికి. "ఉండటానికి దిక్కు లేకపోతేనే ప్రభుత్వం ఇల్లు ఇస్తుందిౖ ఆ ఇల్లు కోసం డబ్బులు అడిగితే మేమేం చేయాలి సార్?" ఆమె మాటలు నిజమే. పేదరికంలో ఉన్నవారికే ఈ ఇండ్లు. అలాంటి వారి దగ్గరే లంచం అడిగితే, వారు ఎక్కడికి వెళ్లాలి?కొందరు అనవచ్చు.. "అది గ్రామ కార్యదర్శి ఆరిఫోద్దీన్ తప్పు మాత్రమే" అని. కానీ నిజం అది కాదు. ఎందుకు ఇలా జరుగుతోంది? పై వారు పర్యవేక్షణ సరిగా చేయడం లేదు.

## తెలంగాణలో మరో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం!



**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 25**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,శనివారం తన కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావానికి అంకురార్పణ చేశారు. ఆమె సొంతంగా నూతన రాజకీయ పార్టీని ప్రకటిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలే అజెండాగా కవిత కొత్త పార్టీని ప్రకటించారు. గతంలో ఉద్యమకాలం నాటి టిఆర్ఎస్' సెంటి మెంట్‌ను గుర్తుకు తెచ్చేలా టిఆర్ఎస్, పేరును ఎంచు కోవడం రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్ అయింది. బిఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల వైపు వెళ్లడం తో,రాష్ట్ర స్థాయిలో ప్రాంతీయ అస్థిత్వాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె సంకేతాలిచ్చారు. మేడ్చల్‌జిల్లా ముషీరాబాద్ లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర సేన పార్టీగా వెల్లడించారు. టిఆర్ఎస్ అని ప్రకటించ డంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా ఆసక్తికర వాతావరణ నెలకొంది.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్

- రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపామని వెల్లడి
- కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు అంగీకరించినట్లు వెల్లడి
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్న మంత్రి



2

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం

## ఇదే చివరి బ్యాచ్...! తెలంగాణ పోలీసుల ఎదుట 47 మంది మావోల లొంగుబాటు

- హైదరాబాద్‌లో 47 మంది మావోయిస్టుల సామూహిక లొంగుబాటు
- డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగించిన మావోలు
- 'ఆపరేషన్ కగార్' విజయంతోనే ఇది సాధ్యమైందని వెల్లడి



## ఇరాన్ తో చర్చల కోసం పాకిస్థాన్ వెళ్లొద్దు.. అమెరికా బృందానికి ట్రంప్ ఆదేశం

- ఇరాన్‌తో చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన ప్రతినిధుల పర్యటన రద్దు
- ట్రూత్ సోషల్ వేదికగా పర్యటన రద్దును ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్
- మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే చాలని ఇరాన్‌కు సూచన
- ఇరాన్ నాయకత్వంలో గందరగోళం ఉందని ట్రంప్ విమర్శ

అమెరికాతో నేరుగా భేటీ అయ్యేది లేదని ఇరాన్ ముందే స్పష్టం చేయడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో చర్చల నిమిత్తం తమ ప్రతినిధుల బృందం

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ఇరాన్ తో చర్చల కోసం పాకిస్థాన్ వెళ్లొద్దు.. అమెరికా బృందానికి ట్రంప్ ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా, ఆ పర్యటనను రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. చర్చల కోసం అంత దూరం ప్రయాణించడం సమయం వృథా అని, వాళ్లు మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌తో సమావేశం కోసం ఇస్లామాబాద్ వెళుతున్న నా ప్రతినిధుల పర్యటనను ఇప్పుడే రద్దు చేశాను. ప్రయాణంతో సమయం వృథా అవుతుంది. ఫలితం లేని చర్చల కోసం అంత దూరం వెళ్లడం అనవసరం. పైగా, ఇరాన్ నాయకత్వంలో తీవ్ర గందరగోళం, అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయి. ఎవరి చేతిలో అధికారం ఉందో వారికే తెలియదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా ప్రతినిధులతో నేరుగా సమావేశమయ్యే ప్రణాళిక ఏదీ లేదని ఇరాన్ ముందుగానే స్పష్టం చేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతోనే తమ అభిప్రాయాలు తెలియజేస్తామని చెప్పింది. ఈ ప్రకటన తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి నేతృత్వంలోని బృందం పాకిస్థాన్ నుంచి బయలుదేరి వెళ్లిపోయింది. ఈ పరిణామాల తర్వాతే ట్రంప్ తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. "అన్ని అస్త్రాలు మా చేతిలోనే ఉన్నాయి, వాళ్ల చేతిలో ఏమీ లేదు. ఒకవేళ వాళ్లు మాట్లాడాలనుకుంటే, చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే!" అని ట్రంప్ తన పోస్టులో ఘాటుగా పేర్కొన్నారు. ఈ చర్చల కోసం అమెరికా తరఫున ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ వెళ్లాల్సి ఉంది. తాజా పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరుగుతున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

## ఇదే చివరి బ్యాచ్...! తెలంగాణ పోలీసుల ఎదుట 47 మంది మావోల లొంగుబాటు

తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఏకంగా 47 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఈ లొంగుబాటు జరిగింది. ఈ సందర్భంగా వారు 34 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని అధికారులు తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు చేపట్టిన ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడం, సాయుధ పోరాటంపై విరక్తి చెందడంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సామూహిక లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా ముగిసినట్లేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి ఇది గట్టి దెబ్బగా పరిగణిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ... ఇంత పెద్ద సంఖ్యలో మావోలు లొంగిపోయిన చివరి బ్యాచ్ బహుశా ఇదేనని, ఇకపై ఈ స్థాయిలో లొంగిపోవడానికి మావోయిస్టులు కూడా ఎక్కువ మంది లేరని అన్నారు. "హింస ద్వారా ఏ సమస్య పరిష్కారం కాదు. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనంలోకి రావాలి" అని ఇంకా అజ్ఞాతంలో ఉన్న కొద్దిమంది మావోయిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే హెల్త్ కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

### మే 9న తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ

### పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.



## "కార్యదర్శి సార్.. ఇదిగోండి లంచం" జగిత్యాలలో ఒక పేద మహిళ కన్నీటి కథ


(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేయడానికి సులువైన దారి లేదు. అవినీతి చేస్తే తగిన శిక్ష పడటం లేదు. ఇవన్నీ కలిపే ఇలాంటి సంఘటనలు రోజూ జరుగుతున్నాయి. గంగమ్మ ఒక్కర్తే కాదు ఇలా బాధపడేది. మన చుట్టూ ఎంతో మంది ఉన్నారు. వాళ్లకు తెలుసు లంచం ఇవ్వకపోతే పని జరగదని. తెలిసీ ఇస్తారు. ఎందుకంటే వాళ్లకు వేరే దారి ఉండదు. ఇది చాలా బాధాకరమైన నిజం. గంగమ్మ ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ చేయించాలి. గ్రామ కార్యదర్శి ఆరిఫోద్దీన్ తో సహా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. గంగమ్మకు వెంటనే ఇల్లు ఇప్పించాలి. ఇక మీద ఇలాంటివి జరగకుండా పారదర్శక వ్యవస్థను తీసుకురావాలి. లంచం ఇచ్చిన పేదలను నేరస్తుల్లా కాకుండా బాధితుల్లా చూడాలి. గంగమ్మ చేతిలోని యాభై వేలు అవి కేవలం డబ్బులు కావు. అవి ఆమె కన్నీళ్లు. కన్నీళ్లను డబ్బుగా మార్చే ఆ వ్యవస్థ ఎంత పెద్దదైనా మనుషుల ముందు అది చిన్నదే. ఈ కథ గంగమ్మ కథ మాత్రమే కాదు. ఇది మన సమాజానికి అద్దం. ఇకనైనా మార్పు రావాలి. అది ప్రభుత్వం చేతుల్లోనే కాదు.. మనమందరి చేతుల్లోనూ ఉంది.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.



## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు.. 13 మందికి స్థానచలనం

### హైదరాబాద్ కలెక్టర్‌గా ఉన్న హరిచందన బదిలీ

### ఢిల్లీ తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా సంజయ్ కుమార్

### పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు మారిన దాన కిషోర్

### ఖమ్మం, నిర్మల్, సంగారెడ్డి కలెక్టర్లకు స్థానచలనం

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు భారీ స్థాయిలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దాసరి హరిచందన సహా పలువురు సీనియర్ అధికారులు, జిల్లా కలెక్టర్లకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గవర్నర్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ కుమార్ (1995 బ్యాచ్)ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కార్మిక, ఉపాధి కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎం. దాన కిషోర్ (1996 బ్యాచ్)ను సంజయ్ కుమార్ స్థానంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిశోర్ పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన (2010 బ్యాచ్) బదిలీ ప్రధానంగా నిలిచింది. ఆమెను కార్మిక, ఉపాధి కల్పన శాఖ కార్యదర్శిగా నియమించారు. దీంతో పాటు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ కార్యదర్శిగా కూడా ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (2018 బ్యాచ్)ని ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేసి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్‌గా, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ం+వీణజ) వీసీ & ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రవీణ్య (2016 బ్యాచ్)ను రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీగా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ (2018 బ్యాచ్)ను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఇంటర్ బోర్డు సెక్రటరీగా నియమించారు. ఇతర ముఖ్యమైన బదిలీలలో, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబ (2016 బ్యాచ్)ను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓగా బదిలీ చేశారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఉన్న కృష్ణ ఆదిత్య (2014 బ్యాచ్)ను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ (2017 బ్యాచ్)ను అదే శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించి, డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగేలా ఆదేశించారు. ఈ మార్పులతో పరిపాలనను మరింత గాడిలో పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన అధికారులకు కూడా వివిధ శాఖల్లో కీలక బాధ్యతలు అప్పగించారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# ఫలించిన చర్చలు.. ముగిసిన ఆర్టీసీ సమ్మె.. రోడ్డెక్కిన బస్సులు

**ఫలప్రదంగా ముగిసిన ఆర్టీసీ జేఏసీ, ప్రభుత్వ చర్చలు**

**మూడు రోజులుగా కొనసాగుతున్న సమ్మె విరమణ**

**కార్మికులకు 11 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం**

**ప్రభుత్వంలో విలీనంపై కమిటీ.. యూనియన్ ఎన్నికలకు హామీ**

**ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కిన ఆర్టీసీ బస్సులు**

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 25**



తెలంగాణలో మూడు రోజులుగా ప్రజా రవాణాను స్తంభింపజేసిన టీజీఎస్ఆర్టీసీ సమ్మెకు శుభం కార్డు పడింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉప సంఘంతో ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్మికుల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో, ఏప్రిల్ 22న ప్రారంభమైన నిరవధిక సమ్మె ముగిసింది. ప్రభుత్వ హామీతో ఇవాళ ఉదయం తొలి షిఫ్ట్ నుంచే బస్సులు రోడ్డెక్కాయి.తెలంగాణ సెక్రటేరియట్‌లో శుక్రవారం అర్ధరాత్రి వరకు మంత్రుల బృందంతో జేఏసీ నాయకులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ 32 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ముఖ్యంగా 2021, 2025 సంవత్సరాలకు సంబంధించిన వేతన సవరణలు (పీఆర్సీ) అమలు చేయాలని, 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని పట్టుబట్టారు. కార్మికుల డిమాండ్లను సావధానంగా విన్న ప్రభుత్వం, వాటి పరిష్కారానికి అంగీకారం తెలిపింది. చర్చల అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. కార్మికులకు 11 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. అలాగే, ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వ విలీనం అంశంపై అధికారులు, కార్మిక సంఘాల నేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను కూడా త్వరలోనే నిర్వహిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆర్టీసీ అనేది ప్రభుత్వంలో అంతర్భాగమని, కార్మికుల సంక్షేమానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్మికులను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పెద్దల నుంచి రాతపూర్వక హామీ లభించడంతో జేఏసీ నాయకులు సమ్మెను విరమించారు. దీంతో మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆర్థిక మోసం కేసులో మంగ్లీ పాత్రపై దర్యాప్తు ముమ్మరం

**నేడో రేపో పోలీస్ కస్టడీకి రమావత్ మధు.. పరారీలో**

**మన దునియా,హైదరాబాద్: ఏప్రిల్ 25**



శుభక్షేత్ర ప్రై. లిమిటెడ్ పేరుతో అమాయకుల నుంచి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు వెలుగులోకి వచ్చిన ఆర్థిక మోసం కేసులో.. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగ్లీ తమ్ముడు శివ, రమావత్ మధు, హేమకాంత్ రెడ్డి ఈ కేసులో ప్రధాన పాత్రధారులుగా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇప్పటికే రమావత్ మధును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే ముఠా నల్లగొండ జిల్లా లో గోకుల నంద ఇన్‌ఫ్రా పేరుతో రూ.కోట్లలో కొట్టేసినట్లు సీఐడీ 5 కేసులు నమోదు చేసినసంగతి తెలిసిందే. ఆ కేసులు విచారణలో ఉండగానే నిందితుల ముఠా.. 'ఏకం విత్ నేచర్' అనే థీమ్‌తో శుభక్షేత్ర ప్రై. లిమిటెడ్ పేరుతో పెట్టుబడులు ఆహ్వానించారు. రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే 101 గజాల స్థలాన్ని రిజిస్టర్ చేయడంతో పాటు.. ప్రతి నెలా 5 శాతం చొప్పున 42 నెలలపాటు రిటర్న్ వస్తాయని బురిడీ కొట్టించి రూ. కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో ఏప్రిల్–17న రమావత్ మధును రిమాండ్‌కు తరలించిన సైబరాబాద్ పోలీసు లు.. మిగిలిన ప్రధాన నిందితులు శివ, అతని స్నేహితుడు హేమకాంత్‌రెడ్డి సహా.. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం జైల్లో ఉన్న రమావత్ మధును పోలీ స్ కస్టడీకి ఇవ్వాల్సిందిగా సైబరాబాద్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. శనివారం తుది వాదనల అనంతరం న్యాయస్థానం మధును పోలీస్ కస్టడీకి అనుమతించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.ఇప్పటికే ఈ కేసులో సింగర్ మంగ్లీ పాత్ర ఎంత మేరకు ఉంది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు.. పలు సాంకేతిక ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. కాగా.. పరారీలో ఉన్న ప్రధాన నిందితులైన శివ, హేమకాంత్‌రెడ్డి ఏపీలోని తిరుమల–తిరుపతిలో తలదాచుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, అమాయక, పేద గిరిజనులు, లంబాడీలను మోసం చేసి కోట్ల రూపాయలు దండుకున్న ఘటనలో సింగర్ మంగ్లీ, ఆమె సోదరుడు శివచౌహాన్‌లది కీలక పాత్ర అని పలువురు బాధితులు ఆరోపించారు. న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం అని వారన్నారు. గిరిజన సంఘా ల ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘాల నాయకులతో కలిసి.. బాధితులు మాట్లాడారు. తాము ఎలా మోసపోయామో వివరించారు. "కడుపు నిండా భోజనం తినక, కంటి నిండా నిద్ర లేక రోజులు గడుపుతున్నాం. ఇక మాకు ఆత్మహత్యే గతి" అని కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ ఘరానా మోసంపై సీబీఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**పంజగుట్ట పోలీసులపై హైకోర్టు ఆగ్రహం**

మంగ్లీ కేసుకు సంబంధించి గతంలో పంజాగుట్ట ఠాణాకు వచ్చిన న్యాయవాది సుబ్బారావుకు సీఐ రామకృష్ణ బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసిన అంశంలో కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదంటూ పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఐపై చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతవారం ఇచ్చిన ఆదేశాల మేరకు ఠాణాలో సీసీ కెమెరాల ఫుటేజీని భద్రపరిచారా? అని ప్రశ్నించింది. పోలీసులు, అడ్వొకేట్లు కలిసి పనిచేయాలని హితవు పలికింది. కాగా మంగ్లీ నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు భద్రత కల్పించేలా ఆదేశాలివ్వాలని హైకోర్టును లాయర్ సుబ్బారావు కోరారు. ఈ కేసు విచారణను కోర్టు వేసవి సెలవుల అనంతరం చేపట్టనుంది..

## హైదరాబాద్‌లో భారీగా లొంగిపోయిన మావోయిస్టులు..

**మన దునియా,హైదరాబాద్,ఏప్రిల్ 25**



తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ కొనసాగుతుంది. శుక్రవారం హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట 47 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న 34 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. వారిని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మరికాసేపట్లో మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. లొంగిపోయి మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్ వాసులేనని పోలీసులు తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో 41 మంది మావోయిస్టులు.. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న సైతం లొంగిపోయారు. ఈ నెల రెండో వారంలో దాదాపు 30 మంది మావోయిస్టులు డీజీపీ ఎదుట లొంగిపోయిన విషయం విదితమే. తాజాగా మరో 47 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే కావడం గమనార్హం.ల దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ 'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది. ఈ ఏడాది మర్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల ప్రభావిత రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య పలు ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. భారీగా మావోయిస్టులను అరెస్ట్ చేశారు. దీంతో మావోయిస్టుల సంఖ్య దేశంలో దాదాపుగా తగ్గిపోయింది..

## కొత్త పార్టీ పేరు ప్రకటించనున్న కవిత

**మన దునియా,హైదరాబాద్, ఏప్రిల్ 25**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు శనివారం ప్రకటించనున్నారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సభలో ఈ రోజు ఉదయం పార్టీ పేరును ఆమె ప్రకటించనున్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఎజెండాపై గంటన్నర పాటు కవిత ప్రసంగించనున్నారు. పార్టీ జెండాలో నీలం, ఆకుపచ్చ, పసుపు రంగులతో రూపొందించారు. నీలం రంగు.. బడుగు బలహీన వర్గాలు, ఆకుపచ్చ.. పంటలు, రైతులు.. పసుపు శుభసూచకంగా పార్టీ జెండా తయారు చేశారు.

**బిల్లు'ను అడ్డగించే శక్తులేవీ?**

రైతులు, మహిళలు, యువత, ఉద్యమకారులు, కుల సంఘాలు, కార్మిక సాధికారత లక్ష్యంగా 60 అంశాలతో పార్టీ ఎజెండాను రూపొందించారు. 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 50 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. కవిత సభ కోసం వివిధ జిల్లాల నుంచి పాదయాత్రలు, ఎడ్లబండ్లపై ప్రజలు తరలి వస్తున్నారు. ఈ సభకు వచ్చే వారి కోసం 34 రకాల తెలంగాణ వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు.కవిత కొత్త పార్టీ కోసం ఏర్పాటు చేసిన సభకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంగా నామకరణం చేశారు. కవిత స్థాపించే కొత్త పార్టీ పేర్లపై ప్రచారం జరుగుతుంది. మొన్నటి వరకు.. తెలంగాణ ప్రజా జాగృతి, నిన్న.. తెలంగాణ వికాస సమితి, నేడు తెలంగాణ రాష్ట్రీయ సమితి అంటూ ప్రచారం జరుగుతుంది. వీటిలో ఒక పేరును కవిత ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది..

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు..

**మన దునియా,హైదరాబాద్ శంషాబాద్:ఏప్రిల్ 25**

హైదరాబాద్:శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు ఈ–మెయిల్ వచ్చింది. విమానాశ్రయం టెర్మినల్‌లో బాంబు పెట్టినట్లు అగంతకులు మెయిల్ చేశారు. దీంతో ఎయిర్‌పోర్ట్ మెత్తం ఒక్కసారిగా కలకలం రేగింది. బాంబు బెదిరింపు విషయం తెలిసి ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.మరోవైపు సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ వింగ్ వెంటనే తనిఖీలు చేపట్టింది. తనిఖీల అనంతరం ఎటువంటి బాంబు లేదని నిర్ధారించింది. ఎవరో ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఇటీవల దేశవ్యాప్తంగా పాఠశాలలు, విమానాశ్రయాలు, న్యాయస్థానాలు వంటి వాటికి తరచుగా ఇలాంటి ఈ–మెయిల్స్, కాల్స్ వస్తున్నాయి..



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి.

రాష్ట్రంలోని కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లో కొనసాగుతున్న అధిక ఫీజుల దోపిడీని నివారించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమానికి రాష్ట్ర విద్యార్థి సేన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి శోభన్ బాబు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా మామిడి శోభన్ బాబు మాట్లాడుతూ విద్య వ్యవస్థలో వ్యాపార ధోరణి పెరిగి పోయిందని సామాన్య ,మధ్యతరగతి తల్లిదండ్రులపై మోయలేని ఫీజుల భారం మోపుతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా పటిష్టంగా అమలు చేసి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రైవేటు విద్యా వ్యవస్థలో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు విద్యార్థుల హక్కుల సాధన కోసం జరగనున్న ఈ ధర్నాలో విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యార్థి సేన పరిషత్ తరపున ఆయన పిలుపునిచ్చారు. 26న ఇంద్ర పార్క్ వద్ద జరిగే ఈ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు

## బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

**కమలాపూర్ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం**


**మన దునియా ప్రతినిధి కమలాపూర్**



కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో బెల్ట్ షాపుల నిర్వహణను పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పంచాయతీ పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శనివారం సర్పంచ్ పబ్బు సతీష్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.సమావేశంలో గ్రామానికి సంబంధించిన తాగునీరు, పారిశుధ్యం, అభివృద్ధి పనులు వంటి పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులు సామాజిక సమస్యలకు దారితీస్తున్నాయని తెలిపారు. అధిక ధరలకు మద్యం విక్రయించడం వల్ల పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. రాత్రింబవళ్లు సమయపాలన లేకుండా మద్యం విక్రయాలు జరగడం వల్ల యువత సహా పలువురు అతిగా మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.బెల్ట్ షాపుల కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయని పేర్కొంటూ, వెంటనే వాటిపై నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.అబ్కారీ శాఖ అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సెలూన్ షాప్ కార్మికుడి పై ఎస్సై దాడి!

**మన దునియా,కరీంనగర్ జిల్లా: ఏప్రిల్ 25**




కాకి చొక్కా ఒంటిపై ఉందన్నా అహంకారంతో ఒక సామాన్య సెలూన్ కార్మికుడి పై ప్రతాపం చూపించాడు ఓ పోలీస్ అధికారి, కరీంనగర్ నగరంలోని ఖాన్ పురా, ఏరియాలో ఈరోజు ఉద యం ఈ ఘటన చోటు చేసుకుంది, కరీంనగర్ జిల్లాలో పోలీస్ అధికారి చేసిన పని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం... నగరంలోని ఖాన్ పురా ఏరియాలో ఉన్న ఒక సెలూన్‌కు కరీంనగర్ త్రీటౌన్ ఎస్సై షేవింగ్ చేయించుకోవ డానికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న రాము అనే వర్కర్, ఎస్సైని ఉద్దేశించి గౌరవంగా కూర్చో అన్నా అని పలికారు. అయితే, ఆ పిలుపు విని సదరు అధికారి ఒక్కసారి గా ఆగ్రహానికి గురయ్యారు. నన్నే అన్నా అంటావా?" అంటూ మండిపడ్డ ఎస్సై, తన హోదాను అడ్డం పెట్టుకుని రాముపై బూతులు తిడుతూ.. విచక్షణార హితంగా దాడి చేశారు. ఒక సామాన్యుడు తనను 'అన్నా' అని సంబోధించ డం ఆ అధికారి అహం కారాన్ని దెబ్బతీసినట్లుగా ఆయన ప్రవర్తన ఉంది. సెలూన్‌లో అందరూ చూ స్తుండగానే బాధితుడిపై చేయి చేసుకుని అసభ్య పదజాలంతో దూషించారు. ఈ దౌర్జన్యానికి సంబంధిం చిన దృశ్యాలన్నీ సెలూన్ లోని సిసిటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యాయి. ఎస్సై వర్కర్‌ను కొట్టడం, దురుసుగా ప్రవర్తించడం వంటి విజువల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు ఇదేనా మీ ఫ్రెండ్లీ పోలీ సింగ్?" అంటూ పోలీస్ శాఖపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. సామాన్యులపై ఇలాంటి దాడులు పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికా రులు స్పందించి, బాధ్యు డైన త్రీటౌన్ ఎస్సైపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు,స్థానికులు కోరుతున్నారు.

# ఏజెన్సీలో 'విద్యా' పోరు...

**జోరుగా ప్రైవేట్ పాఠశాలల ప్రచారం**

**ప్రభుత్వబడులు అడ్మిషన్స్ పెరిగేనా...?**

**మన దునియా మహబూబాబాద్ జిల్లా:కొత్తగూడ: ఏప్రిల్ 25**




మహబూబాబాద్ జిల్లా::: కొత్తగూడ మండలంలో విద్యా సంవత్సరం ముగిసిందో...లేదో... అప్పుడే కొత్త ప్రవేశాల సందడి మొదలైంది. ప్రస్తుతం ఈ మండలంలోని అనేక మంది విద్యార్థులు, సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సంపేటలోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ విద్యార్థులపై కన్నేసిన నర్సంపేటలోని ప్రైవేట్ యాజమాన్యాలు, కొత్తగూడలో విస్తృత ప్రచారానికి తెరలేపాయి. తమ పాఠశాలల్లో సీట్ల కోసం ప్రైవేట్ యాజమాన్యాలు గ్రామ గ్రామాన ప్రచారం చేస్తూ, విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. మారుమూల ప్రాంతాల నుండి విద్యార్థులను రవాణా సౌకర్యాలతో నర్సంపేట తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో కొత్తగూడ విద్యార్థుల చూపు పూర్తిగా నర్సంపేట వైపు మళ్లుతోంది.

ప్రభుత్వ బడుల ముందు పెద్ద సవాల్ గా మారనుందా..!

ఇదిలా ఉంటే, కొత్తగూడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పుడు ఒక సవాలుగా మారింది. గత ఏడాదితో పోలిస్తే, ఈసారి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందా...? లేక తగ్గుతుందా...? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రైవేట్ పాఠశాలల ప్రచార ప్రభావాన్ని ఎదుర్కొంటూ, స్థానిక ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో అడ్మిషన్లు ఏ మేరకు పెంచుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.ప్రైవేట్ పాఠశాలల దూకుడును ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఒక 'ఛాలెంజ్'గా తీసుకుంటారా...? లేదా ప్రైవేట్ పాఠశాలల ప్రచారానికే తల్లిదండ్రులు మొగ్గు చూపుతారా...? అనేది వేచి చూడాలి.

# మల్లారెడ్డి ఫ్యామిలీ బీజేపీలో చేరేది ఇప్పుడే కాదు..!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 25**



మల్లారెడ్డి ఫ్యామిలీ బీజేపీలో చేరుతుందన్న ప్రచారానికి తెలివిగా చెక్ పెట్టారు ఆయన కోడలు ప్రీతిరెడ్డి. బీజేపీ ఆఫీసుకు వెళ్లి సంస్థాగత కార్యదర్శితో సమావేశమైన తరవాత బీజేపీలో చేరడం లేదని చెప్పారు. నిజానికి ఆమె ఏ పార్టీలో లేరు. రాజకీయాల్లో లేరు. కానీ మల్లారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే. కానీ ఆ పార్టీతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. చాలా సార్లు తాను రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకున్నానని కూడా చెప్పారు.వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి బీజేపీ తరపున బరిలోకి దిగబోతున్నారనే విషయం రాజకీయ వర్గాల్లో ఇప్పటికే బహిరంగ రహస్యం. బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, పార్టీలో చేరికకు సంబంధించి ఇంకా ముహూర్తం ఖరారు కాలేదు. అందుకే, అటు బీఆర్ఎస్‌పై గౌరవం ఉందని చెబుతూనే, ఆ పార్టీలోనే శాశ్వతంగా ఉంటామని చెప్పకుండా ప్రీతిరెడ్డి చాలా జాగ్రత్తగా మాట్లాడారు.మల్లారెడ్డి కుటుంబం తమ రాజకీయ భవిష్యత్తును బీజేపీతో ముడిపెట్టేందుకు సిద్ధమైందని ప్రీతిరెడ్డి పర్యటన ద్వారా పరోక్షంగా క్లారిటీ వచ్చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి కొనసాగుతున్నందున, సాంకేతిక కారణాలతో ఇప్పుడే అధికారికంగా కండువా కప్పుకోక పోయినా, తెరవెనుక మాత్రం అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతానికి గౌరవం అనే ముసుగులో పార్టీ మారే అంశాన్ని నాన్చుతున్నప్పటికీ, అంతర్గతంగా బీజేపీ గూటికి చేరేందుకు బలమైన పునాది పడింది. బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చేరికల మిషన్ ఊపందుకున్నప్పుడు అందరి కంటే ముందు వరుసలో మల్లారెడ్డి కుటుంబమే ఉండబోతోందన్నది ప్రీతిరెడ్డి తాజా వ్యాఖ్యలతో స్పష్టమవుతోంది. చేరడం లేదు అని చెబుతూనే బీజేపీ కార్యాలయానికి వెళ్లడం, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చలు జరపడం ద్వారా కార్యకర్తలకు ప్రత్యర్థి పార్టీలకు ఆమె ఒక గట్టి సంకేతాన్ని పంపారు. యూనివర్శిటీ కార్యక్రమాల కోసం అయితే రాజకీయ పార్టీల నేతల్ని. అదీ సంస్థాగత కార్యదర్శుల్ని కలవాల్సిన అవసరం ఏమి ఉంటుంది.

# సమాచార హక్కుతో అవినీతి నిర్మూలనకు కృషి

**ఆర్ టీ ఐ సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ పిలుపు**

**మన దునియా ప్రతినిధి,**

సమాచార హక్కు చట్టం ను ప్రజలు సమర్థవంతంగా వినియోగిస్తే ప్రభుత్వ వ్యవస్థలోని అవినీతికి చెక్ పెట్టవచ్చని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ పేర్కొన్నారు. ప్రజలను చట్టంపై చైతన్యపరచడం, వారి హక్కులను వినియోగించుకునేలా ప్రోత్సహించడం కమిటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి జాతీయ సహాయ కార్యదర్శి మార్క నవీన్ కుమార్, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.సమాచార హక్కు చట్టం ప్రజలకు ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నించే శక్తిని ఇస్తుందని డా. చంటి ముదిరాజ్ అన్నారు.

చట్టం అమలులో ప్రజలకు సహాయం చేయడం, అవగాహన కల్పించడం కోసం కమిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మార్క నవీన్ కుమార్‌ను జాతీయ సహాయ కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర అధికార ప్రతినిధి కాశీ సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శివ కుమార్, అరవింద్ స్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు భోగం విష్ణు, రంగారెడ్డి జిల్లా కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ । ఆదివారం । 26 । 2026



# తీరని నష్టం శంకర్ గౌడ్ కుటుంబానికే..!

**మన దునియా,నర్సంపేట:ఏప్రిల్ 25**



ఆర్టీసీ సమ్మె ముగిసింది. చర్చలు ఫలించాయి. కానీ శుక్రవారం రోజు తెలంగాణ రాజకీయ నేతలంతా చాలా బిజీగాఉన్నారు. కవిత నుంచి బండి సంజయ్ వరకూ. పెద్దిసుదర్శన్ రెడ్డి నుంచి బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తల వరకూ అందరూ చాలా బిజీగా సీరియస్ గా రాజకీయాలు చేశారు. ఆ రాజకీయాలకు ముడిసరుకు ఆర్టీసీ ఉద్యోగి శంకర్ గౌడ్ మృతదేహం. ఆర్టీసీ ఉద్యోగి శంకర్ గౌడ్ ఆత్మబలిదానం చుట్టూ తిరిగిన రాజకీయం, శవ రాజకీయం అనే మాటకు నిలువెత్తు రూపంగా నిలిచింది. ఒక కుటుంబం తమ పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉంటే, రాజకీయ పార్టీలు మాత్రం ఆ మృతదేహాన్ని తమ నిరసనలకు ముడిసరుకు గా మార్చుకున్నాయి. ఒక మనిషి ప్రాణం కంటే రాజకీయ మైలేజీయే ముఖ్యమని భావించే రాజకీయం ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఇవాళ కన్నీళ్లు కార్చే ఈ నేతలు, కెమెరా వెలుతురు ఆరిపోగానే రేపు ఆ కుటుంబాన్ని పలకరించే తీరిక కూడా ఉండదు.

**ఆ కుటుంబానికి ఇక దిక్కెవరు.?**

ఆయన ఏ ఉద్దేశంలో ఒంటికి నిప్పంటించుకున్నారో కానీ ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఇవాళ సానుభూతి చూపించిన రాజకీయ నేతలు రేపు కనిపించరు. ఎవరైనా ఇచ్చే ఆర్థిక సాయం ఆ కుటుంబానికి మనిషి లేని లోటు తీర్చదు. కానీ మరికొన్ని చోట్ల ఆత్మ హత్యాయత్నాలు జరిగినట్లుగా ప్రచారం జరిగింది. ఇదంతా ఓ ట్రాప్. ఎంత మంది ప్రాణాలు తీసుకుంటే అంత ఎక్కువగా రాజకీయాలు చేసుకుంటారు నేతలు. అది వారికి కావాల్సింది. కానీ ప్రాణాలు పోగొట్టుకున్న వారి కుటుంబాలు ఏం కావాలి? ఇక్కడ రాజకీయ నేతలను తప్పు పట్టాల్సిందేమీ లేదు. వారు రాబందులనీ అందరికీ తెలుసు. మరి ఆ రాబందులకు చిక్కకుండా ఉండాల్సిందిఎవరు? ఆర్టీసీ కార్మికులే కాదు. బలిదానాలు అనే మాటవినిపించేప్రతీ చోటా ఆలోచించాల్సిన విషయం ఇది.

**ఆత్మ బలిదానాలు ఒక ప్రమాద కరమైన ట్రాప్.**

శంకర్ గౌడ్ ఘటన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని చోట్ల ఆత్మ హత్యాయత్నాలు జరిగినట్లు సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం సాగింది. ఇది ఒక ప్రణాళికాబద్ధమైన ట్రాప్ అని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రాణాలు పోతే తప్ప ప్రభుత్వం కదలదు అనే భావనను ప్రజల్లోకి బలంగా పంపి, బలిదానాలను ప్రోత్సహించడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఎంత మంది ప్రాణాలు తీసుకుంటే అంతగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచవచ్చని భావించే నేతలు, ఆ పోయిన ప్రాణం వెనుక ఉన్న కుటుంబాల చీకటి భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు.

**బలిదానాల పిలుపులకు బలి కావద్దు.**

తెలంగాణ ఉద్యమ కాలం నుండి బలిదానం అనే మాటకు ఒక భావోద్వేగపూరితమైన గుర్తింపు ఉంది. అయితే, ఈ పదాన్ని ఇప్పుడు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ఆయుధంగా వాడుకుంటున్నారు. ఆర్టీసీ కార్మికులే కాదు, ఏ రంగంలో ఉన్నవారైనా గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. మీరు ప్రాణాలు పోగొట్టుకుంటే రాజకీయ నేతలకు అది ఒక న్యూస్ ఐటమ్ మాత్రమే. కానీ మీ కుటుంబానికి అది తీరని లోటు. నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలకు లోనై, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు మీ పిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తాయి. రాబందులకు రాజకీయ ఆహారంగా మారడం కంటే, జీవించి పోరాడటమే అసలైన ధైర్యం.

**ప్రజల ఆలోచనా దృక్పథం మారాలి.**

రాజకీయ నాయకులను తప్పుపట్టడం వల్ల ఉపయోగం లేదు, ఎందుకంటే వారు అవకాశవాదులని అందరికీ తెలుసు. అయితే, ఆ రాబందుల వలలో చిక్కకుండా ఉండాల్సిన బాధ్యత సామాన్యులదే. ఏ సమస్యా ప్రాణం కంటే పెద్దది కాదు. బలిదానాలను కీర్తించే సంస్కృతికి స్వస్తి పలకాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ప్రజా స్వామ్యయుతమైన నిరసనలు ఎన్నో ఉన్నాయి. ప్రాణాలు తీసుకోవడం వల్ల సానుభూతి లభిస్తుందేమో కానీ, న్యాయం జరుగుతుందన్న గ్యారెంటీ లేదు.

# అంగన్వాడి కేంద్రాల్లో ఈసీసీఈ డే వేడుకలు

**మన దునియా, వాజేడు ,ఏప్రిల్ 25**



పిల్లలకు సమగ్ర అభివృద్ధికి అంగనవాడి సేవలు వినియోగించాలి కన్నాయిగూడెం మండల పరిధిలోని అంగనవాడి కేంద్రాల్లో శనివారం సంసిద్ధత మేల గ్రాడ్యుయేషన్ డే ఈసీసీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు లక్ష్మీ పురం దేవాదుల ,బుట్టాయిగూడెం ,గుర్రెలవుల అంగన్ వాడి కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా అంగన్వాడీ కేంద్రాలు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు పిల్లలకు ఆటలు పాటల ద్వారా విద్యా బోధన చేయడం ద్వారా వారి బాస నైపుణ్యాలు మేదస్సు సామాజిక అభివృద్ధి సృజనాత్మకత పెంపొందిస్తాయని చెప్పారు ఈ అభివృద్ధి దశలను తల్లిదండ్రులు గమనించి ప్రోత్సహించాలని సూచించారు గర్భిణీలు బాలింతలు అంగనవాడి కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని వినియోగించుకోవాలని కోరారు ఈ సందర్భంగా సర్పంచ్ అంబలి సౌజన్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే అన్ని సేవలను తల్లిదండ్రులు పూర్తిగా ఉపయోగించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ పుష్పవతి అంగనవాడి టీచర్ లు రజిత కమరు నిషా అనిత తో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ

**మన దునియా ,వాజేడు ,ఏప్రిల్ 25**





ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఏదిరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు జాతీయ కీటక జన్య వ్యాధులు పరిధిలో వైద్యాధికారి డాక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ గ్రామస్తులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు ఈ సందర్భంగా మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మరియు పరిసరాలకు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు దోమలు కుట్టకుండా చర్యలు తీసుకొని దోమల నుంచి రక్షణ పొందాలని తెలిపారు ప్రతి శు క్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు మలేరియా నిర్మూలన మన చేతుల్లోనే సాధ్యమని వైద్యులు పేర్కొన్నారు ఈ ర్యాలీలో హెచ్ ఒ కుప్పిలి కోటిరెడ్డి సిబ్బంది ప్రవీణ్ రాజేష్ కృష్ణ భూపతి రావు పాల్గొన్నారు

# నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్.



**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:ఏప్రిల్ 25**

భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని స్పష్టం చేశారు. జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.విధుల్లో అలసత్వం వహించినట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో ఉప సర్పంచుల ఫోరం ఎన్నిక

**అధ్యక్షుడిగా బోయిని శ్రావణ్ యాదవ్ ఏకగ్రీవ ఎంపిక**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**



హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బోయిని శ్రావణ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఉప సర్పంచుల సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో సభ్యుల సమగ్ర మద్దతుతో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బోయిని శ్రావణ్ యాదవ్ మాట్లాడుతూ, ఉప సర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచుల పాత్ర మరింత బలపడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఫోరం సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో ఉప సర్పంచుల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుల్ని కలిసిన నూగూరూ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇర్ప శ్రీను

**మన దునియా ,వాజేడు , ఏప్రిల్ 25**

ములుగు జిల్లా వాజేడు మండలం చంద్రుపట్ల గ్రామంలో నీ మర్యాదపూర్వకంగా కలిశారు మరియు వారితోపాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాసరి మురారి వనపర్తి దేవయ్య మరియు రైతులు కలిసి సమావేశం ఏర్పాటు చేశారు దానిలో భాగంగా రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే ట్రాక్టర్కు సంబంధించిన కల్టివేటర్ మరియు రోటవేటర్ టార్పాలియన్ మరియు విత్తనాలు ఇవన్నీ కూడా సంబంధించిన అగ్రికల్చర్ ఏవో గారితో మాట్లాడి అప్లికేషన్ పెట్టుకొని ప్రభుత్వము నుండి వచ్చే సబ్సిడీని పొందాలని ఆయన కోరారు కావున వనపర్తి దేవయ్య అనే రైతు మాకు రోటవేటర్ టార్పాలియన్ 40- 60 కావాలని కోరినారు దానికి స్పందించిన మార్కెట్ కమిటీ చైర్మన్ టార్ ఫాలినన్ చిన్న సైజువి ఉన్నవి కావున పెద్ద టార్పాలినికి ప్రభుత్వ దృష్టికి తీసుకొని పోయి వచ్చేటట్టు చేస్తానని హామీ ఇచ్చారు రైతులు రైతు వారి ఇంప్లిమెంట్స్ గాని టార్ ఫాల్ సీను గాని సంబంధించినవి కావాలనుకుంటే ఏవో గారికి అప్లికేషన్ చేసుకోవాలని కోరినారు అలాగే కొంతమంది ట్రాక్టర్ నీ సబ్సిడీలు లో ఇప్పించాలని కోరినారు వారు దానికి స్పందించి ఏవో గారితో మాట్లాడి అప్లికేషన్ చేసుకోవాలని కోరినారు మరియు ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకు రాగలరని అన్నారు



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?




కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా, పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.


## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే తీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్‌లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శుభ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ఇన్ ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టాంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.

## తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది.2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది.3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## అందం కోసం విలువైన రహస్యం పటిక

పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది.



పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# ఎంగిడి ఆరోగ్యం నిలకడగా ఉంది: ఐపీఎల్ నిర్వాహకుల అప్ డేట్

**ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ లుంగీ ఎంగిడికి గాయం**

**క్యాచ్ పట్టే ప్రయత్నంలో తల నేలకు బలంగా తాకిన వైనం**

**ఆసుపత్రికి తరలింపు.. ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి**

**ఎంగిడి స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా విప్రాజ్ నిగమ్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ లుంగీ ఎంగిడి తీవ్రంగా గాయపడ్డాడు. ఫీల్డింగ్ చేస్తూ తలకు గాయం కావడంతో అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో మైదానంలో కాసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది. అయితే, ఎంగిడి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఐపీఎల్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు.పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఓ క్యాచ్ అందుకునే ప్రయత్నంలో ఎంగిడి కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతడి తల నేలకు బలంగా తగిలింది. వెంటనే తీవ్రమైన తలనొప్పి, మెడనొప్పిగా ఉందని చెప్పడంతో, జట్టు ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించారు. ముందు జాగ్రత్త చర్యగా అతడిని అంబులెన్స్‌లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎంగిడి ఆరోగ్యం నిలకడగా ఉందని, కాసేపట్లో అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయనున్నారని ఐపీఎల్ నిర్వాహకులు తమ ప్రకటనలో తెలిపారు. ఈ అప్‌డేట్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఎంగిడి స్థానంలో విప్రజ్ నిగమ్‌ను కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా జట్టులోకి తీసుకున్నారు.




# ఏమన్నా బ్యాటింగా ఇది... ఐపీఎల్ లో రికార్డు ఛేజింగ్... 265 పరుగుల టార్గెట్ ఉఫ్!

**ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించి పంజాబ్ కింగ్స్ రికార్డు**

**265 పరుగుల భారీ టార్గెట్‌ను 18.5 ఓవర్లలోనే పూర్తి చేసిన పంజాబ్**

**ప్రభ్‌సిమ్రాన్, శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకాలతో జట్టు విజయంలో కీలక పాత్ర**

**ఢిల్లీ తరఫున కేఎల్ రాహుల్ అద్భుత శతకం (152*) నమోదు**

**ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో పరుగుల వర్షం కురిపించిన ఇరు జట్లు**

ఐపీఎల్ చరిత్రలో ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. టీ20 క్రికెట్‌లో అత్యంత కష్టసాధ్యం అనుకున్న లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ అసాధారణ బ్యాటింగ్ తో ఛేదించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 265 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యధిక పరుగుల విజయవంతమైన ఛేదనగా రికార్డులకెక్కింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అద్భుత అర్ధ శతకాలతో పంజాబ్ చారిత్రక విజయం సాధించింది.అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్దేశించిన 265 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (26 బంతుల్లో 76; 9 ఫోర్లు, 5 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (17 బంతుల్లో 43; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 6.5 ఓవర్లలోనే 126 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేశారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో పంజాబ్ 116 పరుగులు రాబట్టి ఢిల్లీ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టింది.ఓపెనర్లు వెనుదిరిగిన తర్వాత కూడా పంజాబ్ జోరు తగ్గలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 71*; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) బాధ్యతాయుతమైన, విధ్వంసకర ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. కూపర్ కానలీ (17), నేహాల్ వధేరా (25) కూడా తమ వంతు సహకారం అందించారు. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివర్లో శశాంక్ సింగ్ (10 బంతుల్లో 19*)తో కలిసి మరో వికెట్ పడకుండా లాంఛనాన్ని పూర్తి చేశాడు. దీంతో పంజాబ్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది.అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ కూడా పరుగుల సునామీ సృష్టించింది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (67 బంతుల్లో 152*; 16 ఫోర్లు, 9 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి అజేయ శతకంతో కదం తొక్కాడు. అతనికి నితీశ్ రాణా (44 బంతుల్లో 91; 11 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుతమైన సహకారం అందించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 220 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 264 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, పంజాబ్ బ్యాటర్ల ధాటికి రాహుల్ వీర శతకం వృథాగా మిగిలింది.



# కమిన్స్ రీఎంట్రీ... టాస్ గెలిచిన సన్ రైజర్స్

**రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్**

**మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్**

**సన్‌రైజర్స్ జట్టులోకి తిరిగి వచ్చిన ప్యాట్ కమిన్స్**

**మధ్య ఓవర్లలో తాము రాణించాల్సి ఉందని చెప్పిన పరాగ్**




ఐపీఎల్ 2026లో భాగంగా జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచింది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఎలాంటి తడబాటు లేకుండా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్‌తో కమిన్స్ తిరిగి జట్టులోకి వచ్చాడు.టాస్ అనంతరం సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ మాట్లాడుతూ, “మేము ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాం. వికెట్ బాగుంది, అయితే ఛేదనకు ఎంత లక్ష్యం అవసరమో చూడాలి. కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్నా, శరీరం చాలా ఉత్సాహంగా ఉంది. హైదరాబాద్ పిచ్ మాకు బాగా తెలుసు, కానీ బయట మైదానంలో ఆడటం ఒక సవాలు. ఇక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడాలి“ అని తెలిపాడు. మధుశంక స్థానంలో తాను, హర్ష్ దూబే స్థానంలో ప్రఫుల్ హింగే జట్టులోకి వచ్చినట్లు కమిన్స్ వివరించాడు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ, “టాస్ గెలిస్తే మేము కూడా బౌలింగే ఎంచుకునేవాళ్లం. అయినప్పటికీ, సొంత మైదానంలో లక్ష్యాన్ని కాపాడుకోవడంపై మాకు నమ్మకం ఉంది. ఈ వికెట్ మాకు బాగా అలవాటు. గత సీజన్‌లో కొన్ని కీలక ఓవర్లలో వెనుకబడ్డాం, కానీ ఈసారి 40 ఓవర్ల పాటు నిలకడగా రాణించాలనేది మా లక్ష్యం. మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు, నేను బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది“ అని పేర్కొన్నాడు.

జట్ల వివరాలు:

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా (వికెట్ కీపర్), అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్ (కెప్టెన్), శివాంగ్ కుమార్, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే, ఎషాన్ మలింగ.

రాజస్థాన్ రాయల్స్

యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రాన్ హెట్మెయర్, డోనోవన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే, నాండ్రే బర్గర్, బ్రిజేష్ శర్మ.

ఇంపాక్ట్ సబ్స్:

రాజస్థాన్ రాయల్స్: లువాన్-డ్రే ప్రిటోరియస్, రవి బిష్ణోయ్, రవి సింగ్, సందీప్ శర్మ, శుభమ్ దూబే.

సన్‌రైజర్స్ హైదరాబాద్: స్మరన్ రవిచంద్రన్, లియామ్ లివింగ్‌స్టోన్, హర్ష్ దూబే, హర్షల్ పటేల్, ట్రావిస్ హెడ్.

# ఇదేం కొట్టుడు... 6 ఒవర్లలో 116 పరుగులు... ఒకే ఓవర్లో 6 ఫోర్లు!

**ఢిల్లీ క్యాపిటల్స్ తో మ్యాచ్**

**పంజాబ్ కింగ్స్ ముందు 265 పరుగుల భారీ టార్గెట్**

**ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోసిన పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్, ప్రియాంశ్**

**కేవలం 18 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్న ఓపెనర్**

ఐపీఎల్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య సృష్టించిన విధ్వంసానికి ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో పరుగుల వరద పారింది. 265 పరుగుల భారీ లక్ష్యం నేపథ్యంలో... పవర్‌ప్లేలో ఈ జోడీ ఆడిన తీరు అసాధారణం. తొలి 6 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ వికెట్ నష్టపోకుండా 116 పరుగుల రికార్డు స్కోరు సాధించింది.ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 18 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్న అతను, ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్ వేసిన ముఖేష్ కుమార్ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రాన్ విశ్వరూపం ప్రదర్శించాడు. ఆ ఓవర్‌లోని ఆరు బంతులను ఫోర్లుగా మలిచి ఏకంగా 24 పరుగులు రాబట్టాడు. స్లోయర్ బంతులు, ఫుల్ టాస్‌లు, షార్ట్ బాల్స్.. ఇలా బంతి ఎలా వేసినా బౌండరీ దాటించడమే పనిగా పెట్టుకున్నాడు. మరోవైపు, ప్రియాంశ్ ఆర్య కూడా దూకుడుగా ఆడి ప్రభ్‌సిమ్రాన్‌కు అద్భుతమైన సహకారం అందించాడు.చివరికి ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 26 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 76 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అవుట్ కాగా... ప్రియాంశ్ ఆర్య 17 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 43 పరుగులు చేసి వెనుదిరిగాడు. అయితే, ఈ మ్యాచ్‌లో ఒక విచారకర ఘటన చోటుచేసుకుంది. రెండో ఓవర్లో ప్రియాంశ్ ఆర్య కొట్టిన బంతిని క్యాచ్ పట్టే ప్రయత్నంలో ఢిల్లీ ఫీల్డర్ లుంగి ఎంగిడి తలకు తీవ్ర గాయమైంది. కింద పడే క్రమంలో అతని తల గట్టిగా నేలను తాకడంతో మైదానంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే వైద్య సిబ్బంది వచ్చి అతడిని స్ట్రెచర్‌పై ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్టేడియంలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## 'ఠాగూర్' సినిమా చేజారడం బాధించింది: రాజశేఖర్



'ఠాగూర్' ఒరిజినల్ మూవీ విజయ్ కాంత్ నటించిన 'రమణ' చిత్రం

ఈ సినిమా రీమేక్ హక్కుల కోసం గట్టిగా ప్రయత్నించిన రాజశేఖర్

చివరకు చిరంజీవి, వినాయక్ దర్శకత్వంలో 'ఠాగూర్'గా వచ్చిన చిత్రం

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఠాగూర్' చిత్రం ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై యాంగ్రీ హీరో రాజశేఖర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి ఈ సినిమా రాజశేఖర్ చేయాల్సిందట. తమిళంలో విజయ్ కాంత్ నటించిన 'రమణ' చిత్రం చూడగానే, ఆ కథ రాజశేఖర్ కు బాగా నచ్చింది. ఆ రీమేక్ హక్కులను తానే సొంతం చేసుకోవాలని గట్టిగా ప్రయత్నించారట. కొన్ని రాజకీయ, వ్యాపార కారణాల వల్ల ఆ కథ చిరంజీవి, నిర్మాత మధు వద్దకు వెళ్ళింది. చివరకు వినాయక్ దర్శకత్వంలో అది 'ఠాగూర్'గా మారి ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. దీనిపై రాజశేఖర్ మాట్లాడుతూ... "ఆ సినిమా నేను చేసి ఉంటే నా కెరీర్ మరోలా ఉండేది. అవకాశం చేజారడం అప్పట్లో బాధ కలిగించినా, చిరంజీవి ఆ పాత్రకు పూర్తి న్యాయం చేశారు" అని భావోద్వేగానికి లోనయ్యారు.

## నాగార్జున నమ్మకపోతే రామ్ గోపాల్ వర్మ కెరీర్ ముగిసిపోయేది: జేడీ చక్రవర్తి

'శివ' సినిమా షూటింగ్ తొలిరోజు ఘటనను గుర్తు చేసుకున్న జేడీ చక్రవర్తి

ఫైట్ మాస్టర్ రాజు ఆలోచనను ఆర్జీవీ వద్దన్నారని వెల్లడి

వర్మను నాగార్జున పూర్తిగా నమ్మారన్న జేడీ

టాలీవుడ్ నటుడు జేడీ చక్రవర్తి తాను నటించిన తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సినీ కెరీర్‌ను మలుపు తిప్పిన 'శివ' సినిమా షూటింగ్ మొదటి రోజు జరిగిన ఒక అద్భుతమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు."షూటింగ్ మొదటి రోజే ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారు. అప్పటి టాప్ ఫైట్ మాస్టర్ రాజు గారు టైర్లు కాల్చడం, పొగ ఎఫెక్ట్స్ వంటివి డిజైన్ చేశారు. కానీ అప్పుడే ఇండస్ట్రీకి పరిచయమవుతున్న ఆర్జీవీ... అవన్నీ వద్దని, తనకు నేచురల్‌గా కావాలని ముక్కుసూటిగా చెప్పేశారు.ఒక కొత్త దర్శకుడు అంతటి మాస్టర్ ఆలోచనను కాదనడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే హీరో నాగార్జున మాత్రం వర్మ ప్రతిభను నమ్మి ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు, ఆ నమ్మకమే నేడు ఆర్జీవీని ఈ స్థాయిలో నిలబెట్టింది" అని జేడీ విశ్లేషించారు. లేకపోతే ఆయన కెరీర్ అప్పుడే ముగిసిపోయేదని అన్నారు. రామ్ గోపాల్ వర్మ ముక్కుసూటి మనిషి అని, ఎవరి అభిప్రాయాలకు లొంగకుండా తన విజన్‌తోనే సినిమాను తెరకెక్కించే వారని జేడీ కొనియాడారు.





## అలాంటి ప్రపంచాన్ని ఎప్పుడూ చూడలేదు: 'టాక్సిక్' పై రుక్మిణీ వసంత్

టాక్సిక్' సినిమా స్కేల్ తాను ఎప్పుడూ చూడని స్థాయిలో ఉందన్న రుక్మిణీ వసంత్

యశ్, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కలిసి ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని వెల్లడి

ఈ సినిమాకు ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తిగా ఉందన్న నటి

యశ్, నయనతార, కియారా అద్వానీ వంటి భారీ తారాగణంతో 'టాక్సిక్'

"కాంతార: ఏ లెజెండ్ చాప్టర్ 1" చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణీ వసంత్, ప్రస్తుతం యశ్ హీరోగా నటిస్తున్న "టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్" సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా భారీతనం, తెరపై ఆవిష్కరించబోతున్న ప్రపంచం గురించి ఆమె వివరించారు.ఈ సినిమా రేంజ్ చాలా పెద్దదని, తానిప్పటి వరకు ఇంత భారీ చిత్రాన్ని చూడలేదని రుక్మిణీ అన్నారు. "దీని స్కేల్ నేను ఇప్పటివరకు చూడని స్థాయిలో ఉంది" అని ఆమె పేర్కొన్నారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్, హీరో యశ్ కలిసి ఓ సరికొత్త ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని ఆమె ప్రశంసించారు. "మా డైరెక్టర్ గీతూ, స్టార్ యశ్ నిర్మిస్తున్న ప్రపంచం చాలా విస్తృతమైనది, కొత్తది. ఇది నాకు చాలా మార్గదర్శకంగా అనిపిస్తోంది. ఈ కొత్త ప్రపంచానికి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆమె తెలిపారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ, రుక్మిణీ వసంత్, అక్షయ్ ఒబెరాయ్ వంటి భారీ తారాగణం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, మలయాళం, హిందీతో పాటు పలు అంతర్జాతీయ భాషల్లో విడుదల చేయనున్నారు. "టాక్సిక్" సినిమాతో పాటు, రుక్మిణీ వసంత్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' (పేరు పరిశీలనలో ఉంది) చిత్రంలో కూడా నటిస్తున్నారు. మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఆమె చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com